RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 266 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 30 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-



# ఓడలు బండ్లవుతున్నాయ్...!

## రేవంత్ పొలిటికల్ రివేంజ్‌తో...

# కుదేలవుతున్న 'కారుసారు'

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ మిగతా పార్టీలన్నీటిని కూడా గడ్డి పోచల్లా భావించేవాడన్నది అందరూ అనుకున్న మాట. ఆ పార్టీతో మాకు పోటీ ఏంటి మేమెక్కడ వాళ్లేక్కడ.. అనే రేంజ్ లో విరుచుకుపడేవాడు. కానీ ఎప్పుడు బండ్లు ఓడలు అవుతాయి.. ఓడలు బండ్లు అవుతాయి అన్నది ఊహించలేము. అంతా ఓటర్ల చేతిలో ఉంటుంది. తెలంగాణ ఓటర్లందరూ మూడోసారి బీఆర్ఎస్ కు అధికారం కట్ట పెట్టాలని అనుకోలేదు. కాంగ్రెస్ కి ముఖ్యమంత్రి పీఠాన్ని అప్పజెప్పారు. ఇంకేముంది తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టిందో లేదో ఇక పొలిటికల్ రివెంజ్ మొదలైంది. ఒకప్పుడు ఉన్న అతి తక్కువ మంది ఎమ్మెల్యేల్లో దాదాపు పది మందిని ఇక పార్టీలో చేర్చుకొని.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని నామరూపాల్లేకుండా చేయాలని అనుకున్నాడు కేసీఆర్. పార్టీలో కీలక నేతలుగా వ్యవహరిస్తున్న వారిపై కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాడు. ఇక ఇప్పుడు పొలిటికల్ రివెంజ్ లో ముఖ్యమంత్రిరేవంత్రెడ్డి అంతకుమించి చేసి చూపిస్తున్నాడు. దీంతో గులాబీ దళపతికేసీఆర్ కి గ్యాప్ లేకుండా వరుసగా షాక్ లు తగులుతూనే ఉన్నాయి. పార్టీలో ఇన్నాళ్లు పక్కనే ఉన్నది బాహుబలిని వెన్నుపోటు పొడిచిన కట్టప్ప లాంటి మనుషులే అన్నది ఇప్పుడిప్పుడే కెసిఆర్ కు అర్థం అవుతుంది.

ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎంతోమంది కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చోటా చోటా నాయకులే కాదు.. ఇక టిఆర్ఎస్ లోని బడా బడా నేతలు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు ఇప్పటికే కేకే, ఆయన కూతురు జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా కాంగ్రెస్లో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇక రంజిత్ రెడ్డి లాంటి మరికొంతమంది కీలక నేతలకు కూడా ఇప్పటికీ కాంగ్రెస్ లో చేరిపోయారు. కడియం కావ్య, కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఖాయంగానే కనిపిస్తుంది. మేం గేట్లు ఓపెన్ చేస్తే మీ పార్టీలో ఒక్క ఎమ్మెల్యే కూడా ఉండడు అని రేవంత్ చెప్పిన విషయమే ఇప్పుడు నిజమయ్యేలా కనిపిస్తోంది. ప్రస్తుత పరిణామాల దృశ్య రేవంత్ పొలిటికల్ రివెంజ్ కెసిఆర్ కు మైండ్ బ్లాక్ అయ్యేలా ఉంది అంటూ కాంగ్రెస్ శ్రేణులు అనుకుంటున్నారట.



## చర్లపల్లిలో చిప్పకూడు తినాల్సిందే

## కేటీఆర్‌కు రేవంత్ వార్నింగ్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది ఫోన్‌లు విన్నామని కేటీఆర్ అంటున్నారని, అలా చేసి ఉంటే చర్లపల్లి జైలులో చిప్పకూడు తినాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలోనే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని.. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫిర్యాదు చేసినా అధికారులు ఎవరూ పట్టించు కోలేదన్నారు. పొరపాట్లు చెయ్యొద్దని గతంలో చెప్పినా అధికారులు వినిపించుకోకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. తప్పులు చేసినందుకే కొందరు అధికారులు జైలుకు వెళ్లారన్నారు. కేటీఆర్ బరితెగించి మాట్లాడుతున్నారని, ఇప్పటి కైనా అహంకారం తగ్గించుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల ఫోన్ కాల్స్‌ను ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమిటన్నారు. ఎవరైనా ఇతర కుటుంబ సభ్యుల కాల్స్ వింటారా అని రేవంత్ ప్రశ్నించారు. భార్య, భర్తల మధ్య ఫోన్లు వినే దుర్మార్గానికి గత ప్రభుత్వం పాల్పడిందన్నారు. కొంతమంది ఫోన్లు విన్నామని కేటీఆర్ అంటున్నారని.. మంది సంసారాల్లో వేలు పెట్టి చూడాల్సిన అవసరం కేటీఆర్‌కు ఎందుకు వచ్చిందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతోందని తెలిపారు.

**వందరోజుల పాలనపై..** తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము అమలు చేసిన పథకాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీలో ఇతర రాష్ట్రాల నేతలను కలిసినప్పుడు తెలంగాణ గురించి చర్చించుకుంటున్నారన్నారు. వంద రోజులపాటు పూర్తిగా అభివృద్ధిపైనే దృష్టి సారించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని తెలిపారు. మొదటి నెల 4వ తేదీన, రెండో నెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చిన వారందరినీ కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.




## రేవంత్‌తో కేకే భేటీ.. రాజకీయ వర్గాల్లో కలకలం

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ, పార్టీ సెక్రటరీ జనరల్ కే. కేశవరావు భేటీ అయ్యారు. కేకే నిన్న బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. చనిపోయే వరకూ కాంగ్రెస్‌లోనే ఉంటానని కేకే తెలిపారు. రేపు ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కేకే కాంగ్రెస్ పార్టీలో చేరనుండటంతో ఒక్కసారిగా రాష్ట్రంలో కలకలం ప్రారంభమైంది. ముందుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరతారని.. ఆమె చేరిన తర్వాత కేకే పార్టీ మారే అవకాశం ఉందంటూ తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆమె కంటే ముందుగానే రేవంత్‌తో కేకే భేటీ అవడం గమనార్హం. కాంగ్రెస్‌లో చేరడంపై బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ, పార్టీ సెక్రటరీ జనరల్ కే. కేశవరావు కీలక తాజాగా ప్రకటన చేశారు. కాంగ్రెస్ తనకు సొంత ఇల్లులాంటిదని చెప్పారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారని.. తాను కూడా తన సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరుతానని స్పష్టం చేశారు. 53ఏళ్లు కాంగ్రెస్‌లో పని చేశానని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను పని చేసింది కేవలం పదేళ్లు మాత్రమేనని తెలిపారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చిందన్నారు. తాను మొదటిసారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యానని కేశవరావు తేల్చిచెప్పారు. తాను పుట్టింది, పెరిగింది, కాంగ్రెస్‌లోనేనని... ఆ పార్టీలోనే చనిపోవాలని అనుకుంటున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదన్నారు. తన కూతురు కాంగ్రెస్‌లో చేరిన రోజు.. తాను ఆ పార్టీలో చేరట్లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరే తేదీ ఖరారు అయిన తర్వాత తానే చెబుతానని అన్నారు. తన కుమారుడు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉండాలని అనుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేశవరావు స్పష్టం చేశారు.

## కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది: కేటీఆర్

హైదరాబాద్: చేవెళ్లలో పోటీ చేస్తున్నది కాసాని జ్ఞానేశ్వర్ కాదు కేసీఆర్ అన్నట్టుగా పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేకే, కడియం వంటి నాయకులు పార్టీని కష్ట కాలంలో వదిలిపెట్టి వెళ్తున్నారని.. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందన్నారు. "అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్లలో చాలా చోట్ల ప్రచారం చేశాను. తాండూరు అసెంబ్లీ సీటు ఏకపక్షంగా గెలుస్తామనుకున్నాం. ఏం జరిగిందో తెలియదు.. కొన్ని చోట్ల



ఓడిపోయాం. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడని అంటారు. పట్నం మహేందర్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మొదట రంజిత్‌రెడ్డే ఫోన్ చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా నన్ను ప్రకటించు..తప్పకుండా గెలుద్దామని చెప్పారు. రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి నాకంటే ఎక్కువగా కాంగ్రెస్‌ను తిట్టారు.

ఆస్కార్ నటుల కంటే బాగా నటించారు. పార్టీ మారిన వారికి ప్రజలే గుణపాఠం చెప్పాలి. సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారి ప్రజలను మోసం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన వాళ్లు బాధ పడే పరిస్థితి వచ్చింది. తుక్కుగూడ కాంగ్రెస్ సభకు కర్ణాటక నుంచి కూడా జనాలను తెప్పిస్తున్నారు. ఏప్రిల్ 13న చేవెళ్లలో జరిగే కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం. రైతుల నుంచే నిప్పు రగిలిద్దాం.. ఉద్యమం ఉద్ధృతం చేద్దాం" అని చెప్పారు.

# కేసీఆర్ పై కాంగ్రెస్, బీజేపీ వ్యూహాత్మక దాడి

## ఖేల్ ఖతం.. దుకాణం బంద్?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దకాలంగా ఒక వెలుగు వెలిగిన కేసీఆర్ కు బిజెపి, కాంగ్రెస్ చుక్కలు చూపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా కేసీఆర్ ను టార్గెట్ చేస్తున్నాయి. దెబ్బ మీద దెబ్బ కొడుతూ కేసీఆర్ ను కుదేలు చేస్తున్నాయి. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో నా మాటే శాసనం ఉన్నట్టు నడిచిన కేసీఆర్ మాట ఇప్పుడు సొంత పార్టీలో కూడా చెల్లుబాటు కాని పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితులకు కారణం బీజేపీ, కాంగ్రెస్ లు అదును చూసి కేసీఆర్ ని దెబ్బ కొట్టడం అనే చర్చ జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన కేసీఆర్ ఈసారి లోక్సభ ఎన్నికలలో సత్తా చాటి పార్టీకి పునర్ వైభవాన్ని తీసుకురావాలని ప్రయత్నం చెయ్యాలనుకున్నారు. కానీ డ్యామిడ్ కథ అడ్డం తిరిగింది అన్నట్టు కెసిఆర్ అనుకున్నది ఒకటైతే, జరుగుతున్నది మాత్రం వేరేగా ఉంది. అసలే ఓటమి నుండి ఇంకా కోలుకోని కెసిఆర్ కు లోక్సభ ఎన్నికలు అగ్ని పరీక్షలా మారాయి. ఇక లోక్సభ ఎన్నికల సమయంలో కేసీఆర్ ను ఊపిరాడని ఇవ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేయాలని నిర్ణయించుకున్న బిజెపి, కాంగ్రెస్ లు వ్యూహాత్మకంగా అడుగులు వేశాయి. తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ టాపింగ్ కేసుతో కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ ను టార్గెట్ చేస్తుంటే, ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత అరెస్టుతో బిజెపి కేసీఆర్ ను టార్గెట్ చేస్తోంది. ఈ కేసులపైన ప్రతిపక్షాల దాడిని ఎదుర్కోవటానికి అష్ట కష్టాలు పడుతున్న వేళ, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను చేరికల పేరుతో ఆపరేషన్ ఆకర్ష అంటూ పార్టీలో చేర్చుకుంటూ ఊహించని దెబ్బ కొడుతున్నాయి. రెండు పార్టీల వ్యూహాలతో కెసిఆర్ ప్రస్తుతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక తాజా పరిణామాలతో కెసిఆర్ ఖేల్ ఖతం.. దుకాణం బంద్ అని అటు రాజకీయ వర్గాలలోను, ఇటు ప్రజలలోను చర్చ జరుగుతుంది. అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ ఎవరినీ లెక్క చేయలేదు.. అధికారం లేకుంటే కేసీఆర్ పరిస్థితి చూడు ఎలా మారిందో అన్నది ప్రధానంగా జరుగుతున్న చర్చ. ఏది ఏమైనా లోక్సభ ఎన్నికలు ఇప్పుడు రావడం నిజంగా కెసిఆర్ కు గండంగా మారిందని, ఇప్పుడు ఉన్న పరిస్థితులను కెసిఆర్ ఎదుర్కోవడం కష్టమే అన్న చర్చ జరుగుతుంది.



# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ కేంద్రం... ప్రత్యేకతలివే!

ప్రస్తుతం దేశంలో ఎన్నికల సందడి నెలకొంది. లోక్ సభ ఎన్నికలకు భారత్ సమాయత్తమవుతోంది. మరోపక్క ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి! అందుకే ఈ ఏడాదిని.. ఎన్నికల ఏడాది అని సంభోదిస్తున్నారు! ఈ సమయంలో ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ కేంద్రం తాషిగ్యాంగ్ గురించి ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.. అవేమిటో చూద్దాం...! ప్రజాస్వామ్యంలో ప్రతీ ఓటూ విలువైనదే. ఒక్క ఓటు విషయంలో కూడా ఎలాంటి పొరపాట్లూ జరగకూడదు.. ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఈ సమయంలో ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ బూత్ అయిన తాషి గ్యాంగ్ పోలింగ్ కేంద్రం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ పోలింగ్ కేంద్రం మరెక్కడో లేదు.. భారత్ లోనే ఉంది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో సముద్ర మట్టానికి సుమారు 15,256 అడుగుల ఎత్తులో ఉంది! అవును... హిమాచల్ ప్రదేశ్ లోని తాషిగ్యాంగ్ పోలింగ్ స్టేషన్ కు ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ పోలింగ్ స్టేషన్ ను నిర్మించిన తర్వాత తొలిసారిగా 2019 లో లోక్ సభ ఎన్నికలు జరిగాయి! అనంతరం... 2021 లో లోక్ సభ ఉప ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మూడోసారి 2024 లోక్ సభ ఎన్నికలకు ఈ పోలింగ్ బూత్ సిద్ధం అవుతుంది! ఈ పోలింగ్ స్టేషన్ కాజా సబ్ డివిజన్ నుంచి 35 కి.మీ. దూరంలో ఉంది. రహదారి నుంచి కేవలం 200 మీటర్ల దూరంలోనే ఉంది. అయినప్పటికీ ఇక్కడ ఒక సమస్య ఉంది. అదే... మంచు! ఇక్కడ సుమారు అడుగు మందంలో మంచు కురుస్తోంది. దీంతో... ఎన్నికల సంఘం జూన్ 1 న ఇక్కడ ఓటింగ్ ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో... ఈ సంవత్సరం దీన్ని మోడల్ పోలింగ్ స్టేషన్ గా మార్చింది ఎన్నికల సంఘం. ఇక ఈ పోలింగ్ కేంద్రంలో 52 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నియోగించ్కోబోతున్నారు. ఈ 52 మందిలోనూ 30 మంది పురుషులు కాగా.. మిగిలిన 22 మంది మహిళా ఓటర్లు. 2019 లోక్ సభ ఎన్నికల సమయంలో ఇక్కడ 45 మంది ఓటర్లే ఉండేవారు. వారులో 27 మంది పురుషులు, 18 మంది మహిళా ఓటర్లు ఉండేవారు! ఇక్కడ గత రెండు సార్లూ 100శాతం పోలింగ్ జరిగిందని అధికారులు చెబుతున్నారు! కాగా హిమాచల్ ప్రదేశ్ లో 10 వేల నుంచి 12 వేల అడుగుల ఎత్తులో సుమారు 65 పోలింగ్ కేంద్రాలు ఉండగా... 12 వేల అడుగుల ఎత్తులో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక తాషిగంగ్ లోని పోలింగ్ కేంద్రం అయితే ఏకంగా... 15,256 అడుగుల ఎత్తులో ఉండి.. ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ కేంద్రంగా నిలిచింది. ఈ ప్రాంతాలకు పోలింగ్ అధికారులు రెండు రోజుల ముందుగానే చేరుకుంటారు!

# భూసేకరణలో జాప్యం



జగిత్యాల: భూసేకరణలో జాప్యమే జాతీయ రహదారుల విస్తరణకు శాపంగా మారుతోంది. జిల్లాలో ప్రధానంగా జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిగా మార్చి దశాబ్దం కావస్తున్నా.. నిర్మాణం మొదలు కావటం లేదు. నిజామాబాద్–జగదల్‌పూర్ జాతీయ రహదారి జిల్లాలో మెట్‌పల్లి నుంచి రాయపట్నం వరకు ఉంది. రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు నాలుగైదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతుండగా.. నిధులు మంజూరైనప్పటికీ భూసేకరణకు అడ్డంకులు ఏర్పడుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్‌బాషా ఇప్పటికే అధికారులతో సమీక్ష జరిపి దిశానిర్దేశం చేశారు. ఇబ్బందులున్న గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

జగిత్యాల–కరీంనగర్: జగిత్యాల–కరీంనగర్ మీదుగా వరంగల్ వరకు జాతీయ రహదారిగా మార్చేందుకు ఆరేళ్ల కిందట నిధులు మంజూరయ్యాయి. నాలుగేళ్ల కిందట భూసేకరణ విషయమై అభ్యంతరాలు రావటంతో అర్ధంతరంగా నిలిచిపోగా ప్రస్తుతం కరీంనగర్–వరంగల్ మధ్య రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండగా జగిత్యాల–కరీంనగర్ మధ్య పనులకు మోక్షం కలగపోవడంతో నిధులు వెనక్కివెళ్లాయి. గతంలో రహదారికి ఒకేవైపు భూసేకరణ జరపాలని నిర్ణయించడంతో భూనిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేయటమే కాకుండా 18 కి.మీ మేరకు మిషన్ భగీరథ పైపులైన్లు పోతుండటంతో నిలిపివేశారు. దీనికి బదులు జగిత్యాల–పెగడపల్లి–చొప్పదండి మీదుగా మానకొండూర్ చేరుకునే విధంగా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ప్రతిపాదించి సర్వే జరిపినప్పటికి పెద్దగా ఉపయోగం ఉండదని భావించి నిలిపివేశారు. ప్రస్తుతం పాత రహదారికిరువైపులా విస్తరణకు ప్రతిపాదించటంతో భూసేకరణ పనులు జరుగుతున్నాయి. జిల్లాలో చల్‌గల్ బైపాస్ రహదారి నుంచి రాజారం మీదుగా నమిలికొండ వరకు 130 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. మరో మూడునెలల్లో భూసేకరణ పూర్తయ్యే అవకాశం ఉన్నప్పటికీ రహదారి విస్తరణ పనులను వచ్చే బడ్జెట్‌లో ప్రతిపాదించనుంటంతో పనులు ఆలస్యమయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

వేగం పెంచుతాం

– పి.మధుసూదన్, జగిత్యాల ఆర్డీవో

జిల్లాలో జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణలో వేగం పెంచుతాం. జగిత్యాల డివిజన్‌లో చల్‌గల్ నుంచి రాయపట్నం వరకు అవసరమైన భూసేకరణ కోసం సర్వే పూర్తయింది. ఆరునెలల్లో ప్రక్రియ పూర్తవుతుంది. జగిత్యాల–కరీంనగర్ రహదారిలో అవసరమైన భూసేకరణ పూర్తికావస్తోంది. మరోమూడు నెలల్లో సేకరణ ప్రక్రియ పూర్తవుతుంది.

నిజామాబాద్–జగదల్‌పూర్

నిజామాబాద్–జగదల్‌పూర్ మధ్య గతంలోనే జాతీయ రహదారి నిర్మాణం జరగ్గా నాలుగు వరుసలుగా విస్తరించేందుకు నిధులు కేటాయించినా అవసరమైన భూసేకరణ ఆలస్యం కావటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో మెట్‌పల్లి నుంచి రాయపట్నం వరకు 224 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. రహదారికిరువైపులా విస్తరించాలని మొదట ప్రతిపాదించగా మార్గమధ్యలో ఉన్న పట్టణ, గ్రామాల ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో పట్టణాలు, మండల కేంద్రాల్లో బైపాస్ రహదారులు నిర్మించటంతోపాటు జగిత్యాల జిల్లా కేంద్రం తగలకుండా చల్‌గల్ నుంచి పొలాస శివారుకు చేరే విధంగా బైపాస్ రహదారి ప్రతిపాదించారు. అక్కడి నుంచి ధర్మపురి పట్టణానికి సంబంధం లేకుండా బుగ్గారం మండలం మీదుగా నేరుగా రాయపట్నం వెళ్లే విధంగా రహదారి నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో సుమారు 69 కి.మీ మేర నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. భూసేకరణ జరిగితే వెంటనే పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

# నిధులు వెచ్చించి.. పనులు వదిలేసి



కరీంనగర్ : పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఆధునిక సాంకేతికను జోడించి పెద్ద నగరాలకు దీటుగా పోటీ పడేందుకు ప్రణాళికలు చేసిన నగరపాలిక.. ఆ విధానం అమలులో వెనుకబడింది. ప్రాజెక్టు అమలు చేయాల్సిన అధికారులు ఎవరికి వారు పట్టనట్లుగా ఉండటంతో వెచ్చించిన నిధులు నిరుపయోగంగా మారేలా కనిపిస్తోంది. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యం కల్పించారు. చెత్త సేకరణ మొదలుకొని.. సేకరించిన చెత్తను తరలించడం వరకు పారిశుద్ధ్య పనులలో నూతన మార్పులు తీసుకొచ్చేలా ప్రతిపాదనలు చేసి నిధులు కేటాయించారు. దశల వారీగా టెండర్లు నిర్వహించిన స్మార్ట్‌సిటీ కన్సల్టెన్సీ, నగర పాలక అధికారులు అక్కడే ఆగిపోయారు. మరోవైపు ప్రతిరోజు టన్నుల కొద్ది వస్తున్న చెత్తను గుట్టలా పేర్చుకుంటూ వెళ్లడం తప్పా దానిని తగ్గించే ఆలోచన మాత్రం చేయడం లేదు. ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బయోమైనింగ్ రెండు అడుగులు వెనక్కి.. ఒక అడుగు ముందుకు అన్నట్లుగా మారింది.

సమయం వృథా అని..

హౌసింగ్‌బోర్డుకాలనీలో ఉన్న రిసోర్స్ పార్కులో ఏర్పాటు చేసిన కంప్యాక్టర్ స్టేషన్ మూత పడింది. 12 టన్నుల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. చెత్తను తగ్గించేందుకు రెండు భారీ వాహనాలు కొనుగోలు చేశారు. నగరంలోని చెత్తను తీసుకొచ్చి ఇందులో తగ్గిస్తారు. ఇందులో 180 టన్నుల చెత్తను 60 టన్నులకు తగ్గించి.. ఇక్కడి నుంచి డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. నగరానికి డంపింగ్‌యార్డు దగ్గరగా ఉండటం, ఇక్కడ గంటల తరబడి వేచి ఉండటం సమయం వృథా అని నేరుగా చెత్తను యార్డుకే తరలిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసిన రెండు ట్రక్కులు మూలన పడ్డాయి. షెడ్డులోపల తాళం వేసి పెట్టగా ఒకరోజు కూడా వాటిని బయటకు తీయడం లేదు. పైగా వాటికి రిజిస్ట్రేషన్ కూడా కానట్లు సమాచారం.

భూగర్భంలోనే చెత్త కుండీలు

రద్దీ ప్రాంతాల్లో చెత్తా చెదారం రోడ్లపై కనిపించకుండా నగరంలోని పది చోట్ల భూగర్భ స్మార్ట్ బిన్స్ ఏర్పాటు చేశారు. పలు చోట్ల వీటిని బిగించగా మరికొన్ని ప్రాంతాల్లో ఆ పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. సెన్సార్ విధానంలో జీపీఎస్ అమలు చేస్తారు. ఒక్కొక్క డబ్బాలో ఏ మేర చెత్త నిండిందనే విషయాన్ని ఎప్పటికప్పుడు శానిటేషన్ విభాగం అధికారికి, ఆ ప్రాంత డ్రైవర్‌కు చరవాణిలో సంక్షిప్త సమాచారం వస్తోంది.

ట్యాగులు.. జీపీఎస్ ట్రాకింగ్ ఏవీ?

నగర పరిధిలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న 5,117 వాణిజ్య దుకాణాల నుంచి చెత్త సేకరణలో జాప్యం రాకుండా స్మార్ట్‌సిటీలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్ (ఆర్ఎఫ్ఐడీ) బిగించారు. దుకాణాల ఎదుట నుంచి చెత్తను ఏ సమయంలో తీసుకెళ్తున్నారు.. ఎంత చెత్త వెళుతుంది? చెత్త తీసుకెళ్లిన తర్వాత తెలిసేలా దీనిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. రీడర్స్ ఇవ్వకపోవడం, చెత్తను సేకరించే వాహనాల డ్రైవర్లకు స్కానింగ్ పరికరాల కొనుగోలులో జాప్యం చేస్తున్నారు. దాంతో ట్యాగ్స్ ఉన్నా వినియోగం లేకుండా పోతున్నాయి

నిధుల కేటాయింపులు ఇలా..

రూ.1.43 కోట్లతో షెడ్డుతో పాటు కంప్యాక్టర్ స్టేషన్ నిర్మాణం

రూ.1.63 కోట్లతో మాడ్రన్ స్మార్ట్‌బిన్స్ ఏర్పాటు పనులు

రూ.16.14 కోట్లతో బయోమైనింగ్ ద్వారా చెత్త శుద్ధీకరణ

# నత్తనడకన నిర్మాణాలు

కోరుట్ల : వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం పల్లెదవాఖానాలు ఏర్పాటు చేసింది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర(సబ్‌సెంటర్ల)ను పల్లె దవాఖానాలుగా మార్చారు. పల్లెదవాఖానాల భవనాలకు నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులను వైద్యఆరోగ్యశాఖకు అప్పగించగా ముందుకు సాగకపోవడంతో తర్వాత పంచాయతీరాజ్‌కు అప్పగించారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

జిల్లాలో 119 పల్లె దవాఖానాలు మంజూరు కాగా ఇప్పటివరకు ఆరు భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. కోరుట్ల మండలంలో ఆరు, కోరుట్ల పట్టణంలో మూడు చోట్ల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని మోహన్‌రావుపేట, జోగన్‌పల్లి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. అయిలాపూర్ గ్రామంలో రెండు, చిన్నమెట్‌పల్లి, యూసుఫ్‌నగర్ గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు. కోరుట్లలో రెండు చోట్ల నిర్మాణ దశలో ఉండగా, మరో చోట పనులు ప్రారంభం కాలేదు. భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పల్లెదవాఖానాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలు ఇరుకుగా ఉండటంతో పాటు మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అనువుగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉన్నతాధికారులకు తెలిపాం..జిల్లా వ్యాప్తంగా ఆరు పల్లెదవాఖనా భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణ దశ పూర్తి కావస్తుండగా, మరి కొన్ని పనులు ప్రారంభించి వదిలేశారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదు. భవన నిర్మాణాల పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదించాం.– శ్రీధర్, జిల్లా వైద్యాధికారి

రూ.20 లక్షలతో..దవాఖానాల్లో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తారు. అన్ని వసతులతో అత్యాధునికంగా



పల్లె దవాఖానాల భవనాలు నిర్మించేలా రూపొందించారు. రాష్ట్రమంతటా ఒకే నమూనాతో భవనాలు నిర్మిస్తున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు వెచ్చిస్తున్నారు. ఒక హాల్, రెండు గదులు, మరుగుదొడ్లు, స్టోర్‌రూమ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. రెవెన్యూశాఖ స్థలాలను అప్పగించగా టెండర్లు సైతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో లేవో అని గుత్తేదారులు పనులు చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

కోరుట్ల మండలం కల్లూర్‌గ్రామానికి పల్లెదవాఖానా మంజూరు కాకపోవడంతో ప్రభుత్వ వైద్యసేవలు కరవయ్యాయి. అయిలాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా గ్రామానికి రెండు ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలు మంజూరయ్యాయి. కల్లూర్, సర్పారాజ్‌పూర్, తిమ్మయ్యపల్లె గ్రామాలకు సబ్ సెంటర్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# వారివి చుట్టపు చూపులే..!

నల్గొండ : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, నీటిపారుదల, పశుసంవర్ధక,రెవెన్యూ, విద్యాశాఖాధికారులను క్లస్టర్ల వారీగా ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. వీరందరూ సొంత విధులపై శ్రద్ధ చూపుతూ ప్రత్యేక అధికారుల బాధ్యతలను విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చి రెండు నెలలు పూర్తి అవుతున్నా.. కొంత మంది అధికారులు ఒకసారి కూడా వారికి కేటాయించిన గ్రామ పంచాయతీలను సందర్శించలేదు. మరి కొందరు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారు.

అపరిశభ్రంగా పల్లెలు.. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త శుద్ధి కేంద్రాల నిర్వహణ పడకేసింది. పల్లెల్లో పోగైన వ్యర్థాలను డంపిగ్‌యార్డులకు తరలించి చెత్తను తడి,పొడిగా వేరు చేసి ఎరువుగా మార్చాల్సిన సిబ్బంది ఆ వ్యర్థాలకు నిప్పు పెట్టి దహనం చేస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో పూర్తిగా వ్యర్థాలను చెత్త శుద్ధి కేంద్రాలకు తరలించకుండానే వాగులు, వంకల్లో పారబోస్తున్నారు. దీంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరో పక్క పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల సమన్వయలోపంతో గ్రామాల్లో పారిశు



ద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పవర్‌బోర్ల మరమ్మతులు పనులు నిలిచిపోతున్నాయి.

సమన్వయలోపం ప్రజలకు శాపం..

అత్యవసర సమయాల్లో సర్పంచులు చేతి నుంచి ఖర్చు చేసి ప్రభుత్వం నుంచి ఆలస్యంగా వచ్చినా తర్వాత తీసుకునే వారు. నేడు ప్రత్యేక పాలనలో నిధులు వస్తేనే పనులు లేకుంటే లేదు అన్న విధంగా మారింది. పేరుకే ప్రత్యేక అధికారులు భారమంతా మాపై పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ఏమైనా సమస్యలను సొంత ఖర్చుతో పరిష్కరించినా దానికి ప్రత్యేకాధికారుల నుంచి సవాలక్ష కొర్రీలు, నేతల ఒత్తిళ్లతో నలిగిపోవాల్సి వస్తోందని వెనుకడుగు వేస్తున్నారు.

# దగా ఆలోచనలపై.. నిఘా

భువనగిరి : గత అసెంబ్లీ ఎన్నిల సందర్భంగా 28 ఏళ్ల యువకుడు భువనగిరి నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి సంబంధించిన అభ్యంతరకరమైన వీడియోను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. కించపర్చే విధంగా ఉన్న సదరు వీడియోపై ఫిర్యాదులు రావడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌తో పాటు, ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగ వేటలో ఉన్న ఆ యువకుడు కేసుల్లో చిక్కుకోవడంతో ఉన్నత ఆశయం చేరుకోవడానికి ప్రతిబంధకంగా మారింది.

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా సామాజిక మాధ్యమాలపై వచ్చిన ఫిర్యాదులు, పోలీసుల నిఘా ద్వారా గుర్తించిన వాటిపై దాదాపుగా జిల్లాలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, ఎన్నికల నియమావళి ఉల్లంఘన, ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఎన్నికల వేళ ఒక్కసారి కేసులు నమోదు అయితే వాటిని పరిష్కరించుకోవడానికి వీలులేకుండా ఉంటాయి. తప్పనిసరిగా కోర్టు విచారణ ఎదుర్కోవాల్సిందే.

సామాజిక మాధ్యమాల్లో కుప్పలు తెప్పలుగా పోస్టులు, వీడియోలు, రీల్స్ వస్తుంటాయి. ఎన్నికల సమయంలో ప్రతి అంశం, తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరికి ఆసక్తి ఉంటుంది. తమ అభిమాన పార్టీలు, నాయకులుకు ప్రచారం కల్పించాలనే కుతుహలంతో ప్రత్యుర్థులుగా ఉండేవారిపై రకరకాలుగా పోస్టులు, వీడియోలను వాట్సప్, ఫేస్‌బుక్ ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేస్తుంటారు. అభ్యర్థులు, పార్టీలకు సంబంధించిన అభ్యంతరకరమైన అంశాలతో పాటు, కించపర్చే వ్యాఖ్యలు ఉంటాయి. వాటిని చూస్తూ ఇతరులకు షేర్ చేయాలనే ఉత్సాహంతో మరిన్ని గ్రూపులలో పోస్టు చేస్తుంటారు. తెలియక చేసిన పోస్టులే కేసుల్లో చిక్కుకునేలా చేస్తాయి. ఎన్నికల సమయంలో కేసుల్లో అభ్యంతకరమైన పోస్టులపై అందిన ఫిర్యాదులతో పోలీసులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద నమోదు చేస్తున్నారు. యువతపై ఎన్నికల వేళ నమోదైన కేసులు వెంటాడుతుంటాయి. కేసుల్లో ఇరుక్కోవడంతో చదువు, ఉద్యోగంపై



ప్రభావం పడుతుంది.

గ్రూప్ అడ్మిన్ తస్మాత్ జాగ్రత్త

వాట్సప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లోని గ్రూపుల్లో ఉండే సభ్యులు ఇష్టానుసారంగా పోస్టులు, వ్యాఖ్యానాలు చేస్తుంటారు. అభ్యంతరకర పోస్టులకు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. వాటిలో వచ్చే రెచ్చగొట్టే వ్యాఖ్యానాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేవిధంగా చేసినట్లయితే వాటికీ బాధ్యత వహించాల్సిదేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నిరాధారమైన పోస్టులు చేస్తే చర్యలు తప్పవు

ఎం.రాజేశ్‌చంద్ర, డీసీపీ

ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సోషల్‌మీడియోపై ప్రత్యేక నిఘా ఉంచాం. వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేవిధంగా వీడియోలు, వ్యాఖ్యానాలు చేసినట్లయితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌తో పాటు, ప్రజాప్రతినిధ్య, ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేస్తాం. ఎన్నికల వేళ వాట్సప్ గ్రూపుల్లో చేసే చర్చలు హద్దుదాటితే చర్యలు తప్పవు.

# జకాత్ జరూర్

హైదరాబాద్ : రంజాన్ మాసం పుణ్యకార్యాలకు మారుపేరు. ప్రేమను పంచాలని, ఆర్థిక, అసమానతలు తొలగించి, పొరుగువారికి సాయపడాలని ఇస్లాం మూలసిద్ధాంతాలు చెబుతున్నాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది 'జకాత్' గురించే. ఈ పేరు వింటే యాచకులు, పేదల ఆనందానికి హద్దులుండవు. జకాత్ ఎక్కడ అంటూ ఆరాతీసి వెంటనే అక్కడికి చేరుకుంటారు.

ఇవీ నిబంధనలు..జకాత్ ఇవ్వడానికి ఒక ముస్లిం దగ్గర 60.755 గ్రాములు బంగారం, 425.285 గ్రాముల వెండి లేదా దీనికి సమానమైన విలువ ఉన్న నగదు, ఇళ్లు, భూమి, వాహనాలు, ఇతర వస్తువులు ఏ రూపంలో ఉన్నా వారు జకాత్ ఇవ్వడానికి అర్హులు. ఉదాహరణకు ఒక్క ముస్లిం వద్ద రూ. 16,200 కంటే ఎక్కువగా నగదు ఉండి ఏడాది దాటితే 40వ భాగం జకాత్‌గా చెల్లించాలి. సంపదలో 2.5శాతం పేదలకు ఇవ్వాలి. జకాత్ ఫిత్రాల వల్ల పుణ్యం లభిస్తుందని పలువురు మత పెద్దలు పేర్కొంటున్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథంలో దీని గురించి పేర్కొన్నారు. మనుషుల్లోని పేద, ధనిక అసమానతలు పోగొట్టడానికి, ఒకరి పట్ల ఒకరికి ప్రేమానురాగాలు, కృతజ్ఞతభావం పెంపొందడానికి ఇవి దోహదపడతాయని మతపెద్దలు చెబుతున్నారు.

అందిస్తున్న సంస్థలు

జకాత్ ప్రధానంగా పేదవారికి, అనాథలకు, వితంతువులు, వికలాంగులకు ఇస్తారు. అయితే కొందరికి జకాత్ ఇవ్వకూడదన్న నిబంధనలు




ఉండటంతో వారికి ప్రత్యామ్నాయంగా సాయం చేస్తుంటారు. పాతనగరంలో ఆర్ఆర్ గ్రూప్, మస్కటీ పాల ఉత్పత్తుల కేంద్రం వారు ఎక్కువగా జకాత్ అందిస్తుంటారు. ఇందులో భాగంగా నెల రోజులు పండగకు అయ్యే ఖర్చులు, బియ్యం, పప్పులు, నిత్యవసరాలు, దుస్తులు ఇస్తున్నారు.

ఆత్మ సంతృప్తి లభిస్తుంది

– ఎంఏ అజీజ్, విశ్రాంత అసిస్టెంట్ ఇంజినీర్, బోరబండ.

చాలా ఏళ్లుగా జకాత్ ఇస్తున్నాం. ప్రతి సంవత్సరం బాధ్యతగా భావించి అవసరమైన వారికి నగదు అందిస్తున్నాం. దీని వల్ల పుణ్యంతో పాటు ఆత్మసంతృప్తి లభిస్తుంది. ఇస్లాం ఫర్జులలో జకాత్ ఒకటి. జకాత్‌ను అర్హత ఉన్న ప్రతి ఒక్క ముస్లిం చెల్లించాలి. జకాత్‌ను చెల్లిస్తే మంచి జరుగుతుందని నమ్మకం.

చాలా ఏళ్లుగా ఇస్తున్నాం

– అంజద్‌ఖాన్, వ్యాపారి

చాలా ఏళ్లుగా జకాత్ అందిస్తున్నాం. ఇస్లాం మతంలో ఐదు సిద్ధాంతాలు కచ్చితంగా ఆచరించాలి. అందులో జకాత్ ఒకటి. రంజాన్ మాసంలో తమకు ఉన్న స్తోమతను బట్టి దానధర్మాలు చేస్తుంటాము. నిరుపేదలు, వితంతువులకు, ఆసరా లేని వారికి ఆసరాగా జకాత్ ఉపయోగపడుతుంది. జకాత్ ఇవ్వడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆస్తిపాస్తులు కలకాలం ఉంటాయి.

# అరచేతిలో వాతావరణ సమాచారం

రామగుండం: వాతావరణ సమాచారాన్ని ప్రతిఒక్కరి దైనందిన కార్యకలాపాల్లో భాగం చేయాలనే ఉద్దేశంతో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇటీవల 'పంచాయత్ మౌసం సేవా' మొబైల్ యాప్ విడుదల చేసింది. 'ప్రతిచోటా వాతావరణం.. ఇంటింటికీ వాతావరణం' పేరుతో ఈ కొత్త సేవను 12 భారతీయ భాషల్లో దేశవ్యాప్తంగా ప్రారంభించింది. ఎప్పటికప్పుడు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, గాలి పవనాల వేగం, తేమశాతం, వర్షపాతం, పిడుగుపాటు, తుపాను హెచ్చరికలు, సూర్యోదయం, సూర్యాస్తమయం వంటి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటం, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు పెరగనుండటంతో ప్రజలు తాజా వాతావరణ ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చని రామగుండంలోని ఐఎండీ పరిశీలన కేంద్రం అధికారులు సూచిస్తున్నారు.

యాప్‌తో లబ్ధి ఇలా..

'పంచాయత్ మౌసం సేవా' మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా చరవాణిలో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లాగిన్ అయి రాష్ట్రం, ప్రాంతం పేరును లేదా పిన్‌కోడ్, అక్షాంశ, రేఖాంశాలను తెలపాలి. వాతావరణ అంశాలను ప్రత్యేకంగా రంగుల(పిక్టోరియల్)తో రూపొందించడం వల్ల సాధారణ ప్రజలు, రైతులకు ఈ యాప్ ద్వారా సమాచారం సులువుగా అర్థం అవుతోంది. ఆంగ్లం, హిందీ సహా 12 భారతీయ భాషల్లో తాజా సమాచారం అందుతుంది. 24 రకాల వాతావరణ సమాచారం, సూచనలను ఈ యాప్‌లో పొందుపరిచారు. ఇందులో ప్రజలకు మొదటిప్రాధాన్యం ఇచ్చారు. దీంతోపాటు రైల్వే, జాతీయ రహదారులు, విమానయానం, రక్షణ, నేవీ, టూరిజం, ఆరోగ్యం, నదులు, వాటి స్థితిగతులు, సీజనల్ వాతావరణం, మార్పులు, చేర్పులు




వంటి వాటి గురించి తెలుసుకోవచ్చు.

ప్రతి గ్రామం.. రైతులతో అనుసంధానం

'పంచాయతీ వాతావరణ సేవ' ద్వారా మౌసం యాప్‌ను దేశంలోని ప్రతి గ్రామంలో అయిదుగురు రైతులతో అనుసంధానం చేయాలనే లక్ష్యంగా భారత వాతావరణ విభాగం అధికారులు ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఐఎండీ ఈ ఏడాది జనవరి 16న దేశంలోని అన్ని వాతావరణశాఖ కార్యాలయాల్లో ఈ యాప్‌ను ప్రారంభించింది. ఈ ఏడాదంతా విద్యార్థులు, ప్రజలు, రైతులకు ప్రదర్శనలు, కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది.

ఏడు దశాబ్దాలుగా సేవలు

రామగుండం పట్టణంలోని ఐఎండీ వాతావరణ పరిశీలన కేంద్రం గత ఏడు దశబ్దాలుగా ఉష్ణోగ్రతలు, వర్షపాతం, గాలుల వేగం వంటి అంశాలపై సేవలు అందిస్తోంది. ఉత్తర తెలంగాణలోని జిల్లాలకు నిరంతరం వాతావరణ సమాచార వివరాలు తెలియజేస్తోంది. నాలుగేళ్ల క్రితం ఈ కేంద్రంలో రేడియో సౌండ్ అండ్ రేడియో విండ్(ఆర్.ఎస్.–ఆర్.డబ్ల్యు.)పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతంలో అయిదు రకాల వాతావరణ పరిస్థితుల వివరాలతోపాటు వారం రోజులకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సైతం సేకరిస్తోంది. ఈ సమాచారాన్ని శాస్త్రవేత్తల విశ్లేషణ కోసం దిల్లీలోని కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు.

# హరిత లక్ష్యం.. కార్యాచరణకు సమాయత్తం



హైదరాబాద్ : జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచడంతోపాటు, పల్లెల్లో పచ్చందాల వృద్ధికి ప్రభుత్వం 9 సంవత్సరాలుగా 'హరిత హారం' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందుకు వివిధ రకాల మొక్కలను గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. ప్రస్తుతం పదో విడతలో నిర్దేశించుకున్న లక్ష్యాలతో పంచాయతీ స్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేస్తూ మొక్కలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇందుకుగాను నర్సరీల నిర్వహణపై మొదట్లోనే శిక్షణ ఇచ్చారు. దీనికి సంబంధించి కథనం.

వర్షాలు ఆరంభంకాగానే శ్రీకారం

ఈ ఏడాదిలో వర్షాలు కురిసిన వెంటనే హరితహారం మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పక్కన నాటే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో (చౌడాపూర్, దుద్యాల నమోదులేదు) 566 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఏడాదిలో 33.99 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ధరించారు. పంచాయతీకి ఒక్కటి చొప్పున నర్సరీలను ఏర్పాటు చేస్తూ ఆయా గ్రామాల్లోని ప్రజల ఆసక్తిని గుర్తించి మొక్కల రకాలను ఎంపిక చేశారు. కొన్ని రకాల మొక్కలను ఇంటి ఆవరణలో పెంచుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవటంతో ప్రతి ఏడాదిలో మొక్కలు మిగిలిపోతున్నాయని అధికారులు గుర్తించారు. ఒక్కో పంచాయతీల్లో కొత్తగా ఐదు వేలతో పాటు ఆయా గ్రామాల్లో గతేడాదిలో మిగిలిన మొక్కలను కలిపి లక్ష్యంగా నిర్ణయించారు.

నవంబరులో ఎర్రమట్టి, పశువుల ఎరువులతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టగా ప్రస్తుతం పచ్చందాలతో నర్సరీలు ఆకట్టుకుంటున్నాయి. హరితహారం అమలు తీరుపై జిల్లాస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలిస్తున్నారు.

ఎరువుల తయారీతో కూలీలకు ఉపాధి

గ్రామాల్లో హరితహారం నర్సరీల నిర్వహణతో కూలీలకు నిత్యం ఉపాధి లభిస్తోంది. ఎర్రమట్టి, పశువుల పేడ, రసాయన ఎరువును మిశ్రమంగా తయారు చేసే సమయం నుంచి కూలీలు, వనసేవకులదే ప్రధాన పాత్రగా ఉంటోంది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మట్టి తీసుకొచ్చిన తర్వాత కూలీలతో సేంద్రియ, రసాయన ఎరువులతో మిశ్రమాన్ని తయారు చేయించటం, సంచుల్లో మట్టిని నింపటం, వరుసల్లో పేర్చటం, విత్తనాలు వేయటం, అంటు కొమ్మల సేకరణ, నీరు పట్టడం వంటి అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. ఒక్కో నర్సరీలో ఇద్దరు, ముగ్గురు చొప్పున పని చేస్తుండగా జిల్లాలో కూలీలు ప్రతి రోజు ఉపాధి పొందుతున్నారు.

పంచాయతీలదే నిర్వహణ బాధ్యతగ్రామాల్లో హరితహారం నర్సరీల బాధ్యతను పంచాయతీలే చూస్తున్నాయి. ఎండలు ముదరడంతో మొక్కలపై కొన్నిచోట్ల చలువ పందిళ్లు వేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు సన్నద్ధంగా ఉంటున్నాం. అందుకు నర్సరీల్లో మొక్కల పెరుగుదలపై దృష్టి సారించాం. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల ఆవరణ, రోడ్డు పక్కల నాటే మొక్కలతో పాటు ఇంటింటికీ సరఫరా చేసేందుకు అనుకూలమైన పండ్లు, పూల మొక్కలను కూడా పెంచుతున్నాం. మల్లికార్జున్, ఏపీఓ, బొంరాస్‌పేట.

# అన్నీ కలిపి.. ఒక్కటే!



హైదరాబాద్: రానున్న 30ఏళ్ల కోసం పక్కా మాస్టర్‌ప్లాన్ తయారీకి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కసరత్తు ప్రారంభించింది. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు 2050 మాస్టర్‌ప్లాన్‌కు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. గతంలోని ఐదు మాస్టర్‌ప్లాన్‌లతోపాటు ఇటీవల రూపొందిస్తున్న మరో రెండు ప్రణాళికలను వచ్చే మాస్టర్‌ప్లాన్‌లో అనుసంధానం చేయనున్నారు. గతేడాది ఆర్థికపరమైన, ప్రజారవాణాకు సంబంధించి రెండు కీలక ప్రణాళికలు తయారీ హెచ్ఎండీఏ సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఎకనామిక్ డెలప్‌మెంట్ ప్లాన్(ఈడీపీ), కాంప్రెన్సివ్ మొబెలిటీ ప్లాన్(సీఎంపీ)లకు కన్సల్టెంట్లను నియమించింది. తాజాగా ఈ రెండు ప్రణాళికను కూడా రానున్న మహా మాస్టర్‌ప్లాన్‌లో అనుసంధానం చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

ఈడీపీలో ఇలా..

ఎకనామిక్ డెలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా ఒక సమగ్ర నివేదికకు రూపకల్పన చేయనున్నారు. వచ్చే 30ఏళ్లలో హైదరాబాద్ మెట్రోప్లాన్ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధి కోసం పక్కా ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రపంచంలో టాప్–10 గ్లోబల్ నగరాల సరసన హైదరాబాద్ చేరాలంటే ఎలాంటి వ్యూహం అనుసరించాలనేది ఇందులో కీలకాంశం. హెచ్ఎండీఏ పరిధిలోని ఆర్థిక పరిస్థితులకుతోడు ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వ దూరదృష్టి ఎలా ఉండాలి.. ఎలాంటి లక్ష్యాలు పెట్టుకోవాలి.. ఏ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి.. అనే అంశాలు పొందుపర్చనున్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక వసతులు, పెట్టుబడుల కోసం కుదుర్చుకునే ఒప్పందాలు, పరిశ్రమల స్థాపన, స్థానిక ఎకనామిక్ సెక్టార్లపై దృష్టి, సరైన పెట్టుబడి విధానాలు ఇత్యాది అంశాలను ఈ ప్లాన్‌లో చర్చించనున్నారు. అనంతరం ఈ ప్రణాళిక అమలుకు తగిన చర్యలు తీసుకోనున్నారు.

సీఎంపీలో ఇలా..

ఏ నగరంలోనైనా ప్రజా రవాణా అత్యంత కీలకం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణాకు పక్కా ప్రణాళిక ముఖ్యం. హెచ్ఎండీఏ రూపొందించనున్న కాంప్రెన్సిన్ మొబెలిటీ ప్లాన్(సీఎంపీ) ప్రధానంగా దీనిపై దృష్టి సారించనుంది.

ఇప్పటికే గ్రేటర్‌వ్యాప్తంగా 80 లక్షలు వాహనాలు తిరుగుతున్నాయి. నిత్యం 3వేల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. భవిష్యత్తులో మరింత జనాభా పెరగనున్న దృష్ట్యా సమగ్రమైన ప్రణాళిక తప్పనిసరి.

ముఖ్యంగా వ్యక్తిగత వాహనాల వాడకం తగ్గించి ప్రజా రవాణా ఎక్కువగా ఉపయోగించుకునేలా దృష్టి సారించాల్సిన అవసరముంది. లేదంటే దిల్లీ మాదిరిగా నగరం కాలుష్య కాసారంగా మారే ప్రమాదం ఎంతో దూరంలో లేదు.

జాతీయ పట్టణ రవాణా పాలసీ(ఎన్‌యూటీపీ)కు అనుగుణంగా ప్రజలకు ఉపయోగకరంగా, వారికి సౌకర్యవంతంగా, భరించేస్థాయిలో ఉండేలా దీర్ఘకాల రవాణా వ్యూహాలపై ఈ సీఎంపీ దృష్టిసారించనుంది. ఇందులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్ఎల్‌లను కూడా భాగస్వామ్యం చేయనున్నారు. 2050 నాటి అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా సక్రమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాజెక్టులపై కూడా సీఎంపీ దృష్టి సారించనుంది. విలువైన సూచనలు, సలహాలు అందించనున్నారు.

# నగదుంటేనే రైడ్ రైట్

హైదరాబాద్ : ఉదయం, సాయంత్రం వేళల్లో క్యాబ్ బుక్ అవడం ఓ ప్రహసనమే. అనేక ప్రయత్నాల తర్వాత గానీ బుక్ అవదు. ఒకవేళ అయ్యి పేమెంట్ విధానం ఎంపిక చేసినా.. డబ్బులు ఎలా చెల్లిస్తారంటూ క్యాబ్ డ్రైవర్లు ఫోన్ చేస్తారు. ఆన్‌లైన్‌లో చెల్లిస్తామని చెబితే ఫోన్ కట్ చేస్తారు. ఆ వెంటనే రైడ్ రద్దవుతుంది. కొందరు డ్రైవర్లు ఫోన్ చేసి జేబులో నగదు ఉంటే సరి లేకపోతే రైడ్ రద్దు చేయాలని సూచిస్తారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారికి క్యాబ్ బుకింగ్‌లో ఎదురయ్యే సమస్యలు వర్ణనాతీతం. ఆన్‌లైన్‌లో, డిజిటల్ పేమెంట్‌లో డబ్బులు చెల్లిస్తామని చెప్పినా వినిపించుకోరు. తప్పని పరిస్థితుల్లో డ్రైవర్లు చెప్పిన ధర చెల్లించి గమ్యం చేరుకుని ఆ తరువాత సదరు క్యాబ్ సంస్థలకు ఫిర్యాదు చేసినా స్పందన ఉండదు. రైడ్ బుక్ చేసి గమ్యం చేరేలోపు ప్రమాదం జరిగి మరణిస్తే రూ.5 లక్షలు, గాయాలైతే చికిత్సకు రూ.లక్ష వరకు క్యాబ్ సంస్థల నుంచి బీమా వర్తించేలా నిబంధనలున్నాయి. ఈ చెల్లింపుల షరతుల మధ్య ప్రయాణికులు బీమా పొందలేకపోతున్నారు.

రద్దుతోనే సమస్య..రైడ్ బుక్ చేసుకున్నాక పికప్ చేసుకోవడానికి వచ్చిన క్యాబ్‌డ్రైవర్ రైడ్ ఛార్జీ ఎంత చూపించిందని అడుగుతారు. ఖైరతాబాద్ నుంచి ఉప్పల్‌కి రూ.180 చూపించిందని చెబితే సరే సార్ కొంచెం రైడ్ రద్దు చేస్తారా? ఎందుకంటే ఇచ్చే మొత్తంలో కంపెనీ రూ.40కి పైగా కట్ చేస్తుందని చెబుతారు. సరే అని ఆ రైడ్‌ను రద్దు చేశామా అంతే. మార్గమధ్యలో సర్జ్, పీక్ ఛార్జీల పేరుతో ధర పెరిగితే పెరిగిన ధర ఇవ్వాలంటూ కొందరు డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల




బీమా వివరాలు క్యాబ్ యాప్‌లో ఉంటాయి. అందులో వివరాలు నమోదు చేయాలి. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్లపై ఫిర్యాదు చేయాలనుకుంటే అందులోనే సపోర్ట్ అనే ఎంపిక ద్వారా సమస్యను వివరించవచ్చు.


రక్షణ ఏదీ?నగరంలో 2 లక్షల కార్లు, లక్ష ఆటోక్యాబ్‌లు, 50 వేల బైక్‌రైడ్ ట్యాక్సీలు రోజూ ప్రయాణికులను గమ్యస్థానాలు చేరుస్తుంటాయి. బైక్‌టాక్సీల్లో ప్రయాణించేవారికి హెల్మెట్ ఇవ్వరు. ట్రాఫిక్ రద్దీని తప్పించేందుకు కొందరు బైక్‌టాక్సీ కెప్టెన్ల విన్యాసాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శివార్లకు వెళ్లేందుకు క్యాబ్‌కే ప్రాధాన్యమివ్వాలి. రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉన్న క్రమంలో ప్రమాద బీమా రక్షణగా ఉంటుంది.

# పఠనాలయం సద్వినియోగం... కల సాకారం

రామగుండం: గ్రంథాలయ పుస్తకాలతోనే ఏకకాలంలో రెండు ఉద్యోగాలు సాధించగలిగాను. తెలంగాణ మైనార్టీ గురుకుల సొసైటీ నిర్వహించిన ఫలితాల్లో పీజీటీ సాంఘికశాస్త్రం, జూనియర్ కళాశాలలో పౌరశాస్త్రం లెక్చరర్‌గా ఉద్యోగాలకు ఎంపికయ్యాను. నాభర్త దుర్గం తిరుపతి కోరిక మేరకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మొదటి సారి గ్రూప్స్, గురుకుల ఉద్యోగానికి పరీక్షలు రాశా. ఆశించిన స్థాయిలో మార్కులు రాలేదు. దీంతో ప్రణాళిక రూపొందించుకుని గ్రంథాలయ సమీపంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సన్నద్ధమయ్యా. పోటీ పరీక్షల్లో విజయం సాధించి రెండు ఉద్యోగాలు సాధించా. ఇటీవల గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం సైతం కల్పించారు. అవసరమైన పుస్తకాలను గ్రంథపాలకురాలు భారతి అందజేయంతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించా. గ్రూప్స్ లక్ష్యంగా ముందుకు సాగుతా.

–కుమ్మరి సువర్ణ, గోదావరిఖని

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంతో అర్హులైన అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కాలంలో నిర్వహించిన తెలంగాణ మైనార్టీ, మహాత్మా జ్యోతిబాపులే, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో విడుదల చేసిన ఫలితాల్లో గోదావరిఖనికి చెందిన పలువురు విజయం సాధించారు. ఉద్యోగాలను




సాధించాలన్న సంకల్పంతో నేటి యువత శిక్షణ కేంద్రాలకు వెళుతున్నారు. మరికొందరు సమీప గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీపట్టి కొలువులు పలువురు కొలువులు సాధించారు.

పఠనాలయమే ఉద్యోగ సోపానం –తంగళ్లపల్లి శ్రీలక్ష్మి, గోదావరిఖని

తొలి ప్రయత్నంలోనే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టీజీటీ సాంఘిశాస్త్రం ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యా. గోదావరిఖని శాఖా గ్రంథాలయ పుస్తకాలు నాకు చేదోడు వాదోడుగా నిలిచాయి. పోటీపరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉండటంతో నిత్యం ఉదయాన్నే గ్రంథాలయానికి వెళ్లా. సందేహాలుంటే గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వైఫై సదుపాయంతో ఆన్‌లైన్‌లో నివృత్తి చేసుకుంటూ నిత్యం సాధన చేశా. చదువుకునేందుకు తల్లిదండ్రులు చాలా ప్రోత్సాహం అందిచారు. గ్రంథాలయానికి వచ్చే ప్రతి పాఠకులు సమయాన్ని వృథా చేయకుండా నిత్యం సాధన చేయాలి.

మూడు ఉద్యోగాలు సాధించా

ప్రైవేటు జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పని చేస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. గతంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఒకటిన్నర మార్కుల తేడాతో ఉద్యోగాలను కోల్పోయా. నిరుత్సాహానికి గురికాకుండా మళ్లీ సన్నద్ధత ప్రారంభించా. గ్రంథాలయంలోని తెలుగు అకాడమీ పుస్తకాలు ఎంతో ఉపయోగపడ్డాయి. వీటిని చదివే మహాత్మా జ్యోతిబాపులే గురుకుల (టీజీటీ) గణితం, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో పీజీటీ, జేఎల్ గణితం ఉద్యోగాలు సాధించాను. నేటియువత ఎక్కడికో వెళ్లి కోచింగ్‌లు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేందుకు వేలరూపాయలు ఖర్చు చేస్తున్నారు. వీటికంటే స్థానికంగా ఉన్న గ్రంథాలయాలను వినియోగించుకొని ప్రణాళికతో సన్నద్ధం కావాలి. –అడుప అనిల్‌కుమార్, గోదావరిఖని

# పంచాయతీల ఖజానా ఖాళీ

సిరిసిల్ల : ఓవైపు ఖజానా ఖాళీ, మరోవైపు సమస్యలు పంచాయతీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జమయ్యే నిధులకు మించిన వ్యయం చేయడంతో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఫిబ్రవరి 2 నుంచి జిల్లాలో 139 మంది ప్రత్యేకాధికారులకు పరిపాలన, పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. చెక్ పవర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారికి కల్పించారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన సమానంగా నిధులు కేటాయిస్తుంటాయి. గత ప్రభుత్వ హయాంలో సుమారు సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. ఎన్నికలకు ముందు కొంత మొత్తం ఖాతాల్లో జమయ్యాయి. ఎఫ్ఎఫ్‌సీ (15వ ఆర్థిక సంఘం) నిధులు సైతం సరిపడా రావడం లేదు. సీసీ ఛార్జీలు (కరెంటు బిల్లులు) కచ్చితంగా చెల్లించాలన్న ఆదేశంతో ఆ నిధులకు కోత పడుతుంది. జనరల్ ఫండ్‌తోపాటు మిగతా చాలీచాలని నిధులతో పల్లెలను నెట్టుకురావడం పెద్ద తలనొప్పిగా మారింది. దాదాపు పదహారు నెలలుగా పల్లెలకు నిధులు విడుదల కావడం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 20 పంచాయతీలు ట్రాక్టర్ వాయిదాలు చెల్లించలేకపోవడంతో నోటీసులు అందాయి. చెత్త సేకరణకు ఇంధనం కొనుగోలు, ట్రాక్టర్ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. దీనికి తోడు చాలా చోట్ల రెండు గ్రామ పంచాయతీలకు ఒక్కరే అధికారిని నియమించారు. ఇతర శాఖల అధికారులకు చెందిన వారికి పంచాయతీల నిర్వహణ, విధులపై అంతగా పట్టు లేదు. దీనికి తోడు తమ కార్యాలయాల్లో పని భారంతో పంచాయతీలకు అంతగా సమయం కేటాయించడం లేదు. దీంతో పాలనలో ఆశించిన మేర ఫలితాలు ఉండటం లేదు.

వేతనాలు లేక...కొన్ని గ్రామాల్లో ట్రాక్టర్లు కదలకపోవడంతో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. కాలువల్లో పూడిక తొలగించక దుర్వాసన వస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు హడావుడిగా అక్కడక్కడా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి వదిలేస్తున్నారు. నాలుగు నెలలుగా పంచాయతీల్లో మల్టీపర్పస్ కార్మికులకు సకాలంలో వేతనాలు అందకపోవడమే ఇందుకు కారణం. సరిపడా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటి ఎద్దడి మొదలైంది. అద్దె బోరులతో నీటి సరఫరా చేయాల్సి వస్తోంది. పంచాయతీ బోర్లలో నీటి మట్టం తగ్గడంతో హరితహారం, నర్సరీల్లో మొక్కలు ఎండుతున్నాయి. పంచాయతీల్లో సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యతో మాట్లాడగా నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా పల్లెల్లో ఇబ్బంది కలుగుతున్నది వాస్తవమేనన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడంతోపాటు ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతామని, ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేసేలా చూస్తామని చెప్పారు. జిల్లాలో తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలసిన ఖానాపూర్ ఎమ్మెల్యే,ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి

**హైదరాబాద్ మార్చి 29(ప్రభాత సమాచారం)**

తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని వారి నివాసంలో పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలసి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సుగుణ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.అనంతరం జ్ఞాపికను అందజేశా రు.ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా అత్రం సుగుణకు ప్రకటింటించినందుకు సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ-పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ గారు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లోకి కడియం.. వరంగల్ ఎంపీ అభ్యర్థిపై ట్విస్ట్




హైదరాబాద్: తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలోకి చేరడానికి బీఆర్ఎస్ సీనియర్ నేత కే.కేశవరావు నిర్ణయించుకు న్నారు. అదే సమయంలో మరో సీనియర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరిక దాదాపు ఖరారైంది. కాంగ్రెస్‌లోకి ఆహ్వానించేందుకు కాంగ్రెస్ నేతల బృందం శుక్రవారం ఉదయం కడియం ఇంటికి వెళ్లింది. ఆ బృందంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీతో పాటు మల్లు రవి, సంపత్ కుమార్, రోహీన్ రెడ్డి ఉన్నారు. దాదాపు అరగంటకు పైగా కడియం నివాసంలో వీళ్లంతా సమావేశం అయ్యారు. అనంతరం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. కడియం శ్రీహరి, కావ్యలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాం.. వీళ్లు అధికారికంగా మా పార్టీలోకి చేరతారు అని ప్రకటించారు దీపాదాస్ మున్షీ. అలాగే.. ఏఐసీసీ ప్రతినిధిగా దీపాదాస్ తమను కలిశారని కడియం చెప్పారు. ఏఐసీసీ, పీసీసీ నన్ను కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. నేను కాంగ్రెస్ లో ఇంకా చేరలేదు. నేను బీఆర్ఎస్ పార్టీ వీడడానికి చాలా కారణాలు ఉన్నాయి. వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరనేది కూడా ఇంకా డిసైడ్ కాలేదు. అనుచరులు, అభిమానులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా అని ఏఐసీసీ ప్రతినిధికి చెప్పా అని కడియం మీడియాతో అన్నారు.



**కావ్య పేరు దాదాపు ఖరారు :** ఇదిలా ఉంటే.. కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైంది. ఈ క్రమంలోనే.. వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ సీటును కావ్య వద్దని చెబుతూ.. కేసీఆర్‌కు లేఖ రాసింది.

మరోవైపు కడియం ఫ్యామిలీ కాంగ్రెస్‌లో చేరతుందనే ప్రచారం తెర మీదకు రాగానే.. వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ తరఫున కడియం శ్రీహరి పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఆ సీటును కావ్యకే కాంగ్రెస్ పార్టీ కేటాయించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో వీళ్లు చేరిన వెంటనే.. అభ్యర్థుల జాబితా ద్వారా కావ్య పేరును అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం.

# జనసేనలో చేరతానని నేను చెప్పలేదు: అనసూయ



యాంకర్ అనసూయ త్వరలో రాజకీయాల్లోకి రానున్నారని, జనసేన పార్టీలో చేరనున్నారంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీటిపై ఆమె తాజాగా స్పందించారు. "నేను తుమ్మినా, దగ్గినా కాంట్రవర్సీ చేస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రాజకీయాల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చానంతే. నాయకుడు నచ్చి, అతడి అజెండా నచ్చితే తప్పకుండా ప్రోత్సహిస్తానని చెప్పా. అంతేకానీ, పార్టీలో చేరతానని లేదా ప్రచారం చేస్తానని చెప్పలేదు. 'జనసేన' పార్టీ అజెండా నాకెంతో నచ్చింది" అని స్పష్టతనిచ్చారు. 'రజాకార్'లో యాక్ట్ చేయడం గురించి మాట్లాడుతూ.. "పాత్ర నచ్చితే తప్పకుండా ఏ చిత్రంలోనైనా నటిస్తా. 'రజాకర్' అనేది మన చరిత్ర. అలాంటి మూవీలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా" అని అన్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.


సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




# కేజ్రీవాల్ కోసం.. వాట్సప్ చేయండి..!

దిల్లీ: దేశంలో అత్యంత అవినీతి, నియంత శక్తులకు వ్యతిరేకంగా తన భర్త పోరాడుతున్నారని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత అన్నారు. ఆయనకు అండగా ఉండేందుకు ప్రజలందరి ఆశీర్వాదం కావాలని కోరారు. ఈ మేరకు మరో వీడియో సందేశం విడుదల చేసిన ఆమె.. వాట్సప్ ప్రచారాన్ని ప్రారంభించారు. "నా భర్త నిజమైన దేశభక్తుడు. కోర్టులో నిల్చుని నిజానిజాలన్నీ బయటపెట్టాలంటే చాలా ధైర్యం కావాలి. ప్రస్తుతం ఆయన నియంత శక్తులను సవాల్ చేస్తున్నారు. ఇప్పుడు మనమంతా ఆయనకు మద్దతుగా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ రోజు నుంచి మేం ప్రత్యేక డ్రైవ్ మొదలుపెడుతున్నాం. కేజ్రీవాల్ కోసం 8297324624 వాట్సప్ నంబరుకు మీ సందేశాలు పంపండి. అవన్నీ నేను ఆయనకు చేరవేస్తాను. మీ ప్రేమ, ఆశీర్వాదాలతో ఆయన ధైర్యంగా ఉంటారు" అని సునీత తన సందేశంలో వెల్లడించారు. మద్యం విధానానికి సంబంధించిన కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌ను గురువారం ఈడీ అధికారులు కోర్టులో హాజరుపర్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జడ్జి అనుమతితో సీఎం స్వయంగా తన వాదనలు వినిపించారు. కేవలం నాలుగు వాంగ్మూలాలతోనే తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. అటు సునీత కూడా నిన్న కోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త ఆరోగ్యం బాలేదని, ఆయనను ఈడీ అధికారులు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



# కేసీఆర్ చేసిన మొదటి తప్పు అదే

హైదరాబాద్: సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన పాపాలే ఆయనకు చుట్టుకున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు.

"యాదగిరిగుట్ట పేరును మార్చడమే కేసీఆర్ చేసిన మొదటి తప్పు. అక్కడ అవినీతి జరిగింది. ఎన్నికల తర్వాత విచారణ చేపడతాం. యాదాద్రి పేరును మళ్లీ యాదగిరిగుట్టగా మారుస్తాం. ఆయన చేసిన పాపాల వల్ల కరవు వచ్చింది. వర్షం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వర్షం. దేవుడి పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి సర్వనాశనం చేశారు. గేట్లు తెరవకముందే కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నేతలు వస్తున్నారు. కేసీఆరే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. నల్గొండ జిల్లాను ఆయన నాశనం చేశారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అక్కడికి వస్తారు? అధికారులతో పాపపు పనులు చేయించారు.

దీంతో వారిప్పుడు భయంతో నిద్రపోవడం లేదు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఏ రాష్ట్రంలోనూ చూడలేదు. కేసీఆర్ ప్రతిదీ రాజకీయం చేశారు" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

# దెబ్బతీయాలనుకునేవారికి ప్రజలే జవాబు చెప్తారు: కేటీఆర్



హైదరాబాద్: శూన్యం నుంచి సునామీ సృష్టించి.. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ధీశాలి కేసీఆర్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఒక్కడుగా బయల్దేరి లక్షల మందితో సైన్యాన్ని తయారు చేశారని.. ఎన్నో అవమానాలు, కుట్రలు, కుతంత్రాలను ఛేదించారని కొనియాడారు. అలాంటి వ్యక్తిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే వారికి తెలంగాణ ప్రజలే జవాబు చెప్తారన్నారు.

ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో కేటీఆర్ పోస్ట్ చేశారు. "ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్లు పోరాడి తెలంగాణ సాధించారు. రాష్ట్ర దశ, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్, భారాసను ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు. నికార్సైన కొత్తతరం నాయకత్వాన్ని తయారుచేస్తాం.. పోరాట పంథాలో కదం తొక్కుదాం" అని ఆయన పిలుపునిచ్చారు.

# దానంకు బిగ్ షాక్.. సికింద్రాబాద్ సీటు మరొకరికి??

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు షాకిచ్చే యోచనలో ఏఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇప్పటికే ఆయన పేరును ఆ పార్టీ ప్రకటించింది. అయితే ఆయన తీరుతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇప్పుడు ఆ టికెట్ మరొకరికి ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే.. ఎంపీ టికెట్ ఉంటుందని దానంకు ఏఐసీసీ ఇదివరకే స్పష్టం చేసింది.

దీంతో మూడో జాబితాలో దానం నాగేందర్ పేరును అధికారికంగా ప్రకటించింది కాంగ్రెస్. అయితే ముందు ఓకే చెప్పి తర్వాత ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. ఈలోపు ఆయన ఎన్నికపై హైకోర్టులో పిటిషన్లు దాఖలు అవుతున్నాయి. కోర్టు సైతం ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఇదంతా పరిగణనలోకి తీసుకున్న ఏఐసీసీ దానంను తప్పించి.. ఆ స్థానంలో మరో అభ్యర్థిని నిలపాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మాజీ మేయర్



బొంతు రామ్మోహన్ పేరు తెర మీదకు వచ్చింది. ఆయన పేరును ఏఐసీసీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అధిష్టానం నిర్ణయం ఏంటన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# త్వరలో సినిమా థియేటర్లపై రైడ్స్.. కోమటిరెడ్డి సంచలనం




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. నేడు ఆయన కాసేపు మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కేటీఆరే ఒప్పుకున్నారన్నారు. ఇద్దరి ముగ్గురి ట్యాపింగ్‌పై వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని కేసు బుక్ చేయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై కేసు ప్రూవ్ అయితే కేటీఆర్‌కు పదేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. సినిమా వాళ్ళ ఫోన్స్ కూడా ట్యాపింగ్ చేశారని తెలిసిందన్నారు. కాశీం రజ్వీ కంటే గొప్పోల్లు కేసీఆర్ వద్ద ఫోన్ ట్యాపింగ్ చేసిన వాళ్లని కోమటిరెడ్డి అన్నారు. త్వరలో సినిమా థియేటర్లపై రైడ్స్ జరుగుతాయని కోమటిరెడ్డి తెలిపారు. ఇష్టం వచ్చినట్లు సినిమా హాల్లో రేట్లు పెంచి వసూలు చేస్తున్నారన్నారు. మా డిపార్ట్మెంట్ టీంలు సినిమా హాళ్లపై నిఘా ఉంచాయన్నారు. తేడా వస్తే థియేటర్లను సీజ్ చేస్తామన్నారు. సినిమా ప్రమోషన్లకు, క్లాపింగ్‌లకు తాను రానని ఇండ్రస్టీలో ఉన్న వారికీ చెప్పానన్నారు. ఎక్కువ బడ్జెట్ పేరుతో సినిమాలు తీసి టికెట్ రేట్లు పెంచాలి అంటే కష్టమన్నారు. దీని వల్ల చిన్న సినిమాను నమ్ముకున్న వాళ్లకు తీరని నష్టం జరుగుతోందన్నారు. సినిమా వాళ్ళ ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనకు ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులూ రాలేదన్నారు. తనకు ఫిర్యాదు చేస్తే అప్పుడు ఆలోచన చేస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఇక పనిలో పనిగా.. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంపై కూడా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండా ఎంపీకి పోటీ కష్టమేనని భావిస్తున్నట్టు తెలిపారు. ఒక పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి... ఇంకో పార్టీలో ఎంపీగా పోటీ అంటే లీగల్ సమస్యలు వస్తాయని అభిప్రాయపడుతున్నట్టు పేర్కొన్నారు. కొత్త వాళ్ళకు టికెట్ ఇవ్వడం అంటే గెలిచే వాళ్లకు ఇస్తున్నారని తెలిపారు. అలాగని అది పాత వాళ్లకు అన్యాయం కాదన్నారు. వారికి తామంతా ఉన్నామన్నారు. హైదరాబాద్ లాంటి వీక్ ఉన్న స్థానాల్లో గెలిచే వాళ్ళకే టికెట్లు ఇస్తున్నారని కోమటిరెడ్డి తెలిపారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660